మైనింగ్ సీనరేజ్ వసూళ్లపై చర్చలు సఫలం

చిలకలూరిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ సీనరేజ్ వసూలుకు సంబంధించి గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులకు ఏఎంఆర్ సంస్థకు మధ్య మంగళవారం రాజీ కుదిరింది. గత కొద్ది రోజులుగా సీనరేజ్ వసూళ్ల విషయంపై గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంత్రి రవికుమార్ సూచన మేరకు చిలకలూరిపేటలో మంగళవారం గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల ప్రతినిధులు పత్తిపాటి సురేష్, చిట్టిపోతు మస్తానయ్య, చెరుకూరి నాగరాజు తదితరులు ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ చర్చలు కొలిక్కి రావడంతో ఇరువర్గాలు ఒక అవగాహన పత్రంపై సంతకాలు చేసుకున్నారు. మైనింగ్ సీనరేజ్ చెల్లింపుల విషయంలో ఇరువర్గాలకు ఇబ్బంది లేకుండా ఉండేలా ఒప్పందం జరిగింది.

అమృత్ పథకంలో ప్రతిపాదించిన నరసరావుపేటలోని కత్తవచెరువు



అమృత్ 2.0కు.. టెండర్లు

- 23 వరకు బిడ్లకు అవకాశం
- నీటి పథకాల విస్తరణకు శ్రీకారం
- ఒకే ప్యాకేజిలో రూ.975.56 కోట్ల పనులు

ఎట్టకేలకు మున్సిపాల్టీల్లో అమృత్ 2.0 పథకం పనులకు టెండర్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. అన్ని మున్సిపాల్టీలకు సంబంధించిన పనులను ఒకే ప్యాకేజి కింద పబ్లిక్‌హెల్త్ శాఖ టెండర్ పిలిచింది. ఈ నెల 23తో టెండర్ ప్రక్రియ ముగియనున్నది. రాష్ట్రం లోనే తొలి సారిగా అమృత్ పనులను రాయితీ హైబ్రీడ్ యూన్యుటీ మోడల్(చామ్) కింద చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తరహాలో మూడు సార్లు టెండర్లు పిలిచింది. అయితే ఈ విధానంలో పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో పాత విధానంలోనే టెండర్లు పిలిచారు. ఈసారైనా టెండర్ ప్రక్రియ పూర్తవుతుందో లేదో చూడాలి.

4లో..

సాగు.. బాగు.. ఎలా

నేడు రైతన్నా మీకోసం.. చర్చా వేదికలు

రైతు సేవా కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు

వ్యవసాయం.. వ్యయసాయం కాదని, అవగాహన, ఆధునికతతో సాగు చేస్తే లాభాలు ఆర్జించవచ్చని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఇప్పటికే గత నెల 24 నుంచి ఆరు రోజులు రైతన్నా మీ కోసం అంటూ ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించింది. రైతు సేవా కేంద్రాల వారీగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా అసలు రైతులకు ఏమి కావాలి.. ప్రభుత్వం ఏమి చేయాలి.. తదితర విషయాలను సేకరించిన అధికారులు సంకలనం చేశారు. ఆయా అంశాలపై చర్చించడంతో పాటు గ్రామాల వారీగా సాగు ప్రణాళికలు రూపొందించడం, ప్రకృతి సాగు, రసాయనాల వాడకం తగ్గించడం, సాగులో మెలకువలపై రైతుల్లోను చైతన్యవంతం చేసే దిశగా బుధవారం ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో చర్చా వేదికలు నిర్వహించనున్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమం కొనసాగింపుగా నిర్వహించే ఈ సదస్సులకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. ప్రజాప్రతినిధులకు, రైతులకు, అధికారులకు ఇప్పటికే ఆహ్వానాలు పంపారు. ఈ క్రమంలో ఈ సదస్సులపై రైతులు ప్రత్యేకంగా ఆసక్తి చూపుతున్నారు.



- ప్రజాప్రతినిధులకు వ్యవసాయశాఖ ఆహ్వానం
- పంటలపై గ్రామస్థాయిలో ప్రణాళిక రూపకల్పన
- ఎరువుల వాడకం తగ్గింపే లక్ష్యంగా రైతుల్లో చైతన్యం



వ్యవసాయ అధికారులు, రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సాగు వ్యయం తగ్గించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో రైతన్నా.. మీకోసం పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా రైతన్నా మీ కోసం కార్యక్రమం జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే పంచ సూత్రాల విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని రైతులకు వివరించారు. పాడి రైతులు, పౌల్ట్రి, గొర్రెల పెంపకందారులు, ఆక్వా, ఉద్యాన, సెరీకల్చర్ రైతులతోనూ మాట్లాడారు. ఈ కార్యక్రమం ముగింపులో భాగంగా రైతు సేవా కేంద్రాల్లో బుధవారం రైతులతో చర్చావేదికలు నిర్వహించనున్నారు. రానున్న సీజన్లలో సాగుపై సమగ్ర ప్రణాళిక రూపొందించడంతో పాటు ఎరువుల వినియోగం తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా ఈ చర్చావేదికలు జరగనున్నాయి. ఈ సదస్సుల్లో ప్రధానంగా పంటల సాగుపై చర్చించనున్నారు. ఏఏ పంటలు సాగుకు ఇష్టపడుతున్నారు.. ప్రభుత్వం నుంచి ఎటువంటి

(మిగతా 5వ పేజీలో)

4న విచారణకు రండి

- సీసీఐ అధికారులకు సీఐడీ సమన్లు
- సీసీ టీవీ ఫుటేజీ తీసుకురావాలని సూచన



రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీసీఐ 'దూది' మాయకు సంబంధించి మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. సుమారు రూ. 140 కోట్లు పక్కదారి పట్టిన ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి విచారణ కోసం గుంటూరు సీసీఐ మేనేజర్‌కు సీఐడీ సమన్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెల 4న ఆయన్ను విచారణకు హాజరు కావాలని సమన్లు జారీ చేసినట్లు సమాచారం. వచ్చేటప్పుడు సీసీ టీవీ ఫుటేజీతో పాటు మరికొన్ని వివరాలు కూడా తీసుకురావాలని చెప్పినట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

ఏప్రిల్‌కి టిడ్కో గృహ ప్రవేశాలు

- పనులపై సమీక్షలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏప్రిల్‌కి 5,520 టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులతో ప్రవేశాలు జరిగేలా కార్యాచరణ చేపట్టామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని టిడ్కో గృహాల నిర్మాణం, రుణ మంజూరుపై సంబంధిత అధికారులు, బ్యాంకర్లు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులతో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలు పొందిన వారు వాటిలో నివాసం ఉండకపోతే అర్హులైన ఇతరులకు అప్పగించాలని అధికారులకు సూచించారు. మొదటి దశ-1లో 520 మందికి గృహాలు ఇవ్వాల్సి ఉందని, వారం తా ఒకేసారి పూర్తి సొమ్ము కట్టినా, లేదా బ్యాంకుల నుంచి రుణం తీసుకున్నా రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. పది రోజుల్లో లబ్ధిదారులకు రుణాలు అందించేలా చూస్తామని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు హామీ ఇచ్చారని చెప్పారు. గతంలో దెబ్బతిన్న టిడ్కో గృహాలకు మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన, ప్రార్థనా మందిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సచివాలయ భవనాలు, కులవృత్తుల వారికి ప్రత్యేక గదులు, శ్మశానాల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. టిడ్కో గృహ సముదాయంలో అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ శ్రీహరిబాబు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరీముల్లా, కౌన్సిలర్లు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుల్లారావు



మన డబ్బు, మన లెక్క

- డ్వాక్రా సొమ్ముల అవకతవకలకు చెక్
- ఈ నారితో పెరగనున్న పారదర్శకత



రెవెన్యూ వసూళ్లలో గుంటూరు సర్కిల్ టాప్

- నాలుగో స్థానంలో పల్నాడు
- చివరి స్థానంలో బాపట్ల
- సీపీడీసీఎల్ పరిధిలో ర్యాంక్‌లు ప్రకటన



గుంటూరులోని డీడీఓ కార్యాలయం

పంచాయతీరాజ్‌లో కొత్త చరిత్ర

- ఆర్డీవో మాదిరిగా.. డీడీవో వ్యవస్థ
- ఉమ్మడి జిల్లాలో ఏడు కార్యాలయాలు
- రూ.1.15 కోట్లతో నూతన హంగులు
- 4వ తేదీన ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం

పంచాయతీ రాజ్‌శాఖలో కొత్త చరిత్ర ఆరంభమైంది. గతంలో నామ్‌కే వాస్తేగా ఉన్న డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్డీవో) పోస్టును పటిష్ఠం చేస్తున్నారు. రెవెన్యూ శాఖలో ఆర్డీవో ఎంత కీలకంగా ఉంటారో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో) కూడా అభివృద్ధి సంబంధిత వ్యవహారంలో అంతే కీ రోల్ పోషించనున్నారు.

నరసరావుపేట బైపాస్ రోడ్డులో దారి దోపిడీ

మోటార్‌సైకిల్, సెల్‌ఫోన్‌తో పారిపోయిన దుండగుడు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట బైపాస్ రోడ్డులో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న నరసరావుపేట మండలం గోనేపూడి గ్రామానికి చెందిన జంగా కోటేశ్వరరావు అనే వ్యక్తిని అడ్డగించి మోటార్ సైకిల్‌తో పాటు అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో దుండగుడు పారిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కోటేశ్వరరావు నరసరావుపేటలో పనులు ముగించుకుని శనివారం బైపాస్‌లో బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. ఈ సమయంలో వినుకొండ రోడ్డులోని వై జంక్షన్ వద్ద రాత్రి 9 గంటల సమయంలో అతడ్ని దొంగలు ఆపి మోటార్ సైకిల్, సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరసగా జరుగుతున్న ఈ తరహా దోపిడీలపై ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల నరసరావుపేట మండలం గురవాయపాలెం వద్ద దంపతులపై మందుబాబులు దాడికి దిగిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మరువకముందే పెట్లూరువారిపాలెం ఉప్పలపాడు గ్రామాల మధ్య ఓ వ్యక్తిని బెదిరించి సెల్‌ఫోను, వెండి ఆభరణాలను లాక్కొని పారి పోయారు. ఈ ఘటనలపై పోలీసులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్త నుంచి సంపద

- పరిసరాల శుభ్రత.. ఆదాయం
- నెలకు 2 టన్నుల కంపోస్టు ఎరువుల ఉత్పత్తి



తడి చెత్తతో పాటు పనికి రాని కూరగాయలతో ఫ్లాట్ ఫారం ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

వినుకొండటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెత్తను తొలగించి.. పరిసరాలు పరిశుభ్రతతో పాటు ఆదాయమే లక్ష్యంగా వినుకొండ మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. పట్టణంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తడి, పొడి చెత్తలను సేకరిస్తున్నారు. దీనిని ప్రత్యేకంగా వేరు చేసి తడిచెత్తతో పాటు హోల్‌సేల్ మార్కెట్‌లో పనికిరాని కూరగాయలను వాహనాల ద్వారా తిమ్మాయపాలెం రోడ్డులోని వర్మీ కంపోస్టు షెడ్‌కు తరలిస్తు న్నారు. ఇక్కడ వ్యర్థాలు కుళ్లిన అనంతరం వర్మి కంపోస్టు షెడ్లకు తరలిస్తారు. వానపాములను వదిలి ఎరువులుగా మారుస్తున్నారు. ఇలా నెలకు 2 టన్నుల కంపోస్టు ఎరువులను తయారు చేస్తున్నారు. ఈ ఎరువు లను మున్సిపాలిటీ పరిధిలో మొక్కలకు ఎరువుగా వేసి వాటిని సంరక్షిస్తున్నారు. మిగిలిన ఎరువును అవసరమైన వారికి కేజీ రూ.50 చొప్పున విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ తెలిపారు.



వానపాముల సాయంతో వర్మీ కంపోస్టు ఎరువు



వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ కోసం ఏర్పాటు చేసిన బెడ్‌లు

పది పరీక్షలకు.. రూ.125 ఫీజు

- అధికంగా వసూలు చేస్తే చర్యలని ప్రకటన

నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సాధారణ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల ఫీజు రూ.125గా విద్యాశాఖ ఖరారు చేసింది. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫీజు చెల్లించవచ్చు. కాగా విద్యార్థులు స్వయంగా కూడా ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించుకునే అవకాశం ఇచ్చింది. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివరాలను యుడైజ్‌లో ధ్రువీకరించిన తర్వాతనే స్వయంగా ఫీజు చెల్లించే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది. స్వయంగా ఫీజు చెల్లించాలనుకునే విద్యార్థులు ఈ విషయాన్ని సంబంధిత ప్రధానోపాధ్యాయులకు తప్పనిసరిగా తెలియజేయాలి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధిక మొత్తాన్ని వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. అధిక ఫీజు డిమాండ్ చేసిన పక్షంలో విద్యార్థులు సెల్ఫ్ పేమెంట్ ప్రొవిజన్ ద్వారా స్వయంగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చన్నారు. విద్యార్థుల వివరాలను యుడైజ్‌లో ధ్రువీకరించకుండా ఇబ్బందులు కలిగించే ప్రధానోపాధ్యాయులపై విద్యార్థులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. నిర్దేశిత ఫీజు కంటే అధికంగా వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలలపై జరిమానా విధిస్తామన్నారు. అనధికార వసూళ్లపై ఫిర్యాదు చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థులకు విద్యాశాఖాధికారులు సూచించారు.

ఇదీ కంభంపాడు దుస్థితి



సైడు కాలువలు లేక మురుగునీటితో నిండిన రహదారులు

అధ్వాన పారిశుధ్యం.. మట్టి రోడ్లు

మాచర్ల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండల పరిధిలోని కంభంపాడు మేజర్ పంచాయతీ అయినా సమస్యలతో సతమతం అవు తోంది. మాచర్ల పట్టణానికి అనుకొనేఉన్నా, గ్రా మంలో ఇంకా మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. ప్రధానంగా ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, గరిశె సెంటర్ తదితర ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. శ్మశానానికి వెళ్లే రహదారి, పొలాలకు వెళ్లే రహదారులు కూడా మట్టి రోడ్లే కనిపిస్తున్నాయి. వర్షం పడిందంటే పొలాలకు వెళ్లేందుకు రైతులు నరకయాతన పడుతున్నారు. పాలకులు, అధికారులు గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శ్మశానానికి వెళ్లే రహదారి

నాణ్యమైన పత్తినే తీసుకురావాలి

నాదెండ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కేంద్రానికి రైతులు నాణ్యత గల పత్తిని మాత్రమే తీసుకురావాలని సీసీఐ ఏజీఎం సంజయ్‌ద్వివేది రైతులకు సూచించారు. గణపవరంలోని వెంకటకృష్ణ ఎంటర్‌ప్రైజెస్‌లోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పత్తిని తీసుకురావడం వల్ల రైతులు గరిష్ఠ మద్దతు ధర పొందగలుగుతారన్నారు. ప్లాస్టిక్ సంచుల్లో తీసుకురావద్దని, సాధ్యమైనంత వరకు లూజు పత్తిని తీసుకురావాలని రైతులకు సూచించారు. వ్యర్థాలు కలిస్తే పత్తి నాణ్యత తగ్గడంతో పాటు ధర కోల్పోతారన్నారు. తేమ ఎనిమిది నుంచి 12 శాతం లోపు మాత్రమే ఉండాలని, గుడ్డి కాయ ఉంటే తొలగించి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, బయ్యర్ రమేష్ తదితరులు ఉన్నారు.

గణపవరం సీసీఐ కేంద్ర పరిశీలనలో ఏజీఎం



- పత్తిని పరిశీలిస్తున్న సీసీఐ ఏజీఎం సంజయ్ ద్వివేది



మన డబ్బు, మన లెక్క

● డ్వాక్రా సొమ్ముల అవక తవకలకు చెక్
● ఈ నారితో పెరగనున్న పారదర్శకత

సత్తెనపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల పేరుతో రుణాలు మంజూరు చేసి గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయ కులు కొందరు సొమ్ములు నొక్కేశారు. అలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం మన డబ్బు, మన లెక్క కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రత్యేక యాప్ ఐవీఆర్ఎస్‌ను రూపొం దించింది. దీని ద్వారా సభ్యులకు వారి రుణాల కు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించనుంది. అలాగే ప్రతి పది సంఘాలకు ఒక ఈ నారిని నియమించనుంది.

● పారదర్శకంగా వాయిదా చెల్లింపులు

సభ్యులు తీసుకున్న రుణాలను మూడేళ్ళ కాల పరిమితిలో చెల్లించాలి. ఏడాదికి ఒక సారి చెల్లించే స్వల్ప కాలిక రుణాలు ఉంటున్నాయి. సంఘంలోని సభ్యులు వాయిదాలు చెల్లించేం దుకు వెళ్ళటం లేదు. సంఘ ప్రతినిధులు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారు వాయిదాలు సక్రమంగా చెల్లించని సందర్భాలున్నాయి. సభ్యులు మోసపోయామని గ్రహించేసరికే పుణ్యకాలం కాస్తా గడిచిపోతోంది. కేసులు నమోదు చేస్తున్నారు కాని సొమ్ములు మాత్రం బాధ్యుల నుంచి రికవరీ చేయలేకపోతున్నారు. ఇక మీదట ఇలాంటి మోసాలకు మన డబ్బు, మన లెక్కతో చెక్ పెట్టనున్నారు. చేతి వాటానికి అవకాశం లేకుండా, ప్రతి నెలా ఐవీఆర్ఎస్‌లో సభ్యులందరికీ సమాచారం రానుంది. మరో వైపు యాప్‌లోనే తమ వాయిదాల చెల్లింపు, బకాయి సొమ్ము వివరాలను తెలుసుకొనే సౌకర్యం ఉండనుంది. అలాగే తప్పులను నివేదించేలా ఐవీఆర్ఎస్‌లోనే ఫిర్యాదు చేసుకొనే అవకాశాన్ని సభ్యులకు కల్పించనున్నారు. దీనిపై డ్వాక్రా అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తారు. అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటారు. మన డబ్బు, మన లెక్కపై ప్రతి గ్రామంలోనూ సభలను ఏర్పాటు చేసి మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

● ఈ నారిలకు బాధ్యతలు

మన డబ్బు, మన లెక్క కార్యకలాపాలు సక్రమంగా సాగేలా ప్రతి పది డ్వాక్రా గ్రూపులకు ఈ నారిలను నియమించనున్నారు. సంఘాల్లో క్రియాశీలకంగా ఉంటున్న వారిని ఈ నారీలుగా ఎంపిక చేస్తారు. ప్రస్తుతం సీఆర్పీలు అన్ని వ్యవహారాలను చక్క బెడుతున్నారు. ఇకపై ఈ నారీలు మన డబ్బు, మన లెక్కలో బాధ్యతాయుతంగా వ్యవహరించ నున్నారు. రుణాలు తీసుకోవటం, వాయిదాల చెల్లింపు అంతా జవాబుదారి తనంతో ఉండేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

4న విచారణకు రండి

● సీసీఐ అధికారులకు సీఐడీ సమన్లు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఎవరూ ఊహించని రీతిలో గతేడాది సీసీఐలో జరిగిన 10 శాతం దూది మాయ వ్యవహారంపై లోతైన విచారణ జరిపేందుకు సీఐడీ రంగంలోకి దిగడం కలకలం రేపు తోంది. ఇప్పటికే ఈ అంశంపై హైకోర్టులో కేసు విచారణ జరుగుతోంది. వాస్తవానికి సీసీఐ వ్యవహారం రాష్ట్ర పరిధి లోనిది కానప్పటికీ భారీస్థాయిలో అక్రమాలు జరగడం, అందులోనూ ఆర్థిక నేర కోణం ఉండటంతో సీఐడీ విచారణ ఆరంభించినట్లు తెలుస్తోంది.

● దూది అమ్మకాలు.. పెద్ద దందా

రైతులు సీసీఐ కేంద్రాలకు తీసుకొచ్చే పత్తిలో కోత పెట్టటం అనేది సర్వసాధారణంగా మార్చేశారు. అలా పక్కకు తీసిన పత్తిని దూదిగా మార్చి అమ్ముకుంటు న్నారు. అదంతా పెద్ద దందాలా కొనసాగుతోందని చెబుతు న్నారు. అలా వచ్చిన సొమ్ములను సీసీఐలోని బయ్యర్ల దగ్గర నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు పంపకాలు జరుగుతాయన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా పక్కకు తీసిన దూది బేళ్లను కేవలం రాష్ట్రంలోనే కాక, పక్క రాష్ట్రా ల్లో కూడా అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిసింది. అదే జరిగితే ఈ కేసు తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది.

● మంత్రి ముందే అసభ్య పదజాలం

ఈ మధ్య కాలంలో సీసీఐ కేంద్రాలను పరిశీలించేందుకు వ్యవసాయ మంత్రి రాగా కొందరు జిన్నర్లు ఆయన ముం దే అసభ్యంగా మాట్లాడటంపై చర్చ జరుగుతోంది.

సీసీ టీవీ ఫుటేజీలు తీసుకురండి

● రాష్ట్రంలోని జిన్నర్లకు సీసీఐ నోటీసులు

గుంటూరు సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన జిన్నింగ్ మిల్లుల యజమానులకు సీసీఐ నోటీసులు జారీ చేసింది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన జిన్నింగ్ మిల్లుల సీసీ టీవీ ఫుటేజీలు తీసుకురావాలని మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది అక్టోబరు 29వ తేదీ నుంచి జి న్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీ టీవీల ఫుటేజీలు తీ సుకురావాలని సీసీఐ అధికారులు నోటీసులు జారీ చేశారు.

పంచాయతీరాజ్‌లో కొత్త చరిత్ర

● ఆర్డీవో మాదిరిగా.. డీడీవో వ్యవస్థ ● ఈ నెల 4న ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వ చ్చిన తర్వాత పంచాయతీ రాజ్‌లో చేప ట్టిన గణనీయమైన మార్పుల్లో డీడీవో వ్యవస్థ అత్యంత కీలకంగా కనిపిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం ఏడు డీడీవో కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 4న పంచాయతీ రాజ్ శాఖా మం త్రి పవన్ కల్యాణ్ కొత్తగా ఏర్పాటు అ యిన డీడీవో కార్యాలయాలను వర్చువ ల్‌గా ప్రారంభించనున్నారు. ఉమ్మ డి గుంటూరు జిల్లాలో ఏర్పాటు చేసిన డీడీవో కార్యాలయాలను అందంగా తీర్చిదిద్దేందు కు జిల్లా పరిషత్ నుంచి రూ.1.15 కోట్లు కేటాయించారు. పంచాయతీరాజ్‌కు చెంది న బిల్డింగ్‌లోనే డీడీవో కార్యాలయా లను నూతన హంగులతో ఏర్పాటు చేశారు.

● ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏడు చోట్ల డీడీవో కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. గుంటూరు, తెనాలి, సత్తెనపల్లి, నరసరా వుపేట, గురజాల, రేపల్లె, బాపట్లలో నూతన కార్యాలయాలు ఏర్పాట య్యాయి. ఈ నెల 4వ తేదీ తర్వాత డీడీవోలు నూతన కార్యాలయం నుంచే విధులు నిర్వర్తించనున్నారు. గ్రామ, వార్డు సచివా లయ వ్యవస్థను పూర్తిగా పర్యవేక్షించటం, ఉపాధి హామీ పథకం, గ్రామ పంచాయతీ లపై కూడా పూర్తి అజమాయిషీ డీడీవోకు అప్ప గించనున్నారు. ఇటువంటి కీలకమైన బాధ్యతలు నిర్వర్తించేందుకు ఒక్కో డీడీవో కార్యాలయంలో సుమారు 15 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు.

● ఇదొక అద్భుతమైన సంస్కరణ



పంచాయతీ రాజ్ చరిత్రలో వచ్చిన గొప్ప మార్పుల్లో డీడీవో వ్యవస్థ ఒకటి. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదొక అద్భుతమైన సంస్కరణ. ఈ శాఖలో ఇంత కీలకమైన పోస్టు రూపుదిద్దుకోవటంలో డిప్యూటీ ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ కమిషనర్ చూపించిన చొరవ చాలా గొప్పది. దీని ద్వారా డివిజన్ స్థాయిలో డీడీవో పూర్తి అధికారం కలిగిన శక్తి గా అవతరించినట్లే. ఉమ్మడి జిల్లాలో ఏడు డీడీవో కార్యాలయాలు ఏర్పాటు చేశాము.

-వీర్ల జ్యోతి బసు, సీఈవో, జిల్లా పరిషత్

రెవెన్యూ వసూళ్లలో గుంటూరు సర్కిల్ టాప్

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్) పరిధిలో రెవెన్యూ వసూళ్ల రికార్డు స్థాయిలో సాధించి గుంటూరు సర్కిల్ టాప్‌లో నిలిచింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు వరకు రెవెన్యూ వసూళ్ల సాధించిన సర్కిల్స్‌కు సీపీడీసీఎల్ ఉన్నతాధికారులు ర్యాంకులు ప్రకటించారు. ఇందులో భాగంగా మొత్తం ఏడు సర్కిల్స్ ఉన్న సీపీడీసీఎల్‌లో గుంటూరు సర్కిల్ మొదటి స్థానంలో నిలవటం విశేషం. గుంటూరు సర్కిల్ గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌లతో కలిపి రూ.773.39 కోట్లతో ప్రథమ స్థానం సాధించింది. ఇక రెండో స్థానంలో ఎన్‌టీఆర్ జిల్లా ఉండగా, పల్నాడు సర్కిల్ నాలుగో స్థానంలో నిలిచింది. పల్నాడు సర్కిల్‌లో 374.9 కోట్లతో నాలుగో ర్యాంకు సాధించగా, రాజధాని పరిధిలోని సీఆర్‌డీఏలో సర్కిల్ 350.92 కోట్లతో ఐదో స్థానంలో నిలిచింది. ఇక బాపట్ల సర్కిల్ రెవె న్యూ వసూళ్లలో వెనుకబడింది. బాపట్ల సర్కిల్‌లో రూ. 387.07 కోట్లతో ఏడో స్థానంలో నిలిచింది.

● అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే....

సర్కిల్ వ్యాప్తంగా అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే మొదటి ర్యాంకు సాధించాం . ఈ ఆర్థిక సంవత్సరాంతం ఇదే విధంగా పనిచేసి మరింత వృద్ధి సాధించేలా కృషి చేస్తాం.

-గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్



అమృత్ పథకంలో ప్రతిపాదించిన పిడుగురాళ్ల చెరువు

అమృత్ 2.0కు.. టెండర్లు

23 వరకు బిడ్లకు అవకాశం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అమృత్ 2.0లో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మునిసి పాల్టీల్లో రూ.975.56 కోట్ల అంచనాతో 54 పనుల చేపట్టనున్నారు. అమృత్ పథకంలో ఆయా మున్సిపాల్టీలతో పాటు గుంటూరు కార్పొరేషన్‌లో నీటి పథకాలను విస్తరిస్తారు. రానున్న 25 ఏళ్లలో పెరిగే జనాభాకు అనుగుణంగా 24/7 తాగునీటిని సరఫరా చేసే దిశగా నీటి పథకాలను విస్తరిస్తారు. చెరువుల అభివృద్ధి, పైపులైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపడతారు. పట్టణాల్లో భూగర్భ జలాలను పెంపొందించేందుకు చెరువులను అభివృద్ధి చేస్తారు. చెరువుల్లో పూడిక తీత, కట్టలు పటిష్టం, వాకింగ్ ట్రాక్‌లను నిర్మిస్తారు. పట్టణాల్లో ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలకు తాగునీటి సరఫరాకు పైపులైను, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, కుళాయి కనెక్షన్ల పనులు అమృత్ 2.0లో చేపట్టనున్నారు.

ఈ పట్టణాలకు డబల్ ధమాకా

గుంటూరు కార్పొరేషన్, మాచర్ల, పిడుగు రాళ్ల మున్సిపాల్టీలకు నిధులు వెల్లువెత్తాయి. అమృత్ పథకంతో పాటు, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (యూఐడీఎఫ్) నుంచి కూడా నిధులు విడుద లయ్యాయి. ఆయా పట్టణాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనున్నది. అమృత్ పథకంలో రూ.454.82 కోట్లు విడుదల కాగా యూఐడీఎఫ్‌లో రూ.501.07 కోట్లు కేటాయించారు. యూఐడీఎస్ కింద మాచర్లకు రూ.109.34 కోట్లు, పిడుగురాళ్లకు రూ.177.67 కోట్లు, గుంటూరు కార్పొరేషన్‌కు రూ.214.06 కోట్లు విడుదలయ్యాయి. యూఐడీఎఫ్ పథకం కింద చేపట్టే పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. రానున్న పది రోజుల్లో ఈ పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

మునిపాల్టీల వారీగా అమృత్ 2.0 నిధులు ఇలా..


మునిసిపాల్టీ	నిధులు రూ. కోట్లలో
నరసరావుపేట	29.42
చిలకలూరిపేట	161.30
దాచేపల్లి	49.62
పిడుగురాళ్ల	36.26
గురజాల	18.62
సత్తెనపల్లి	0.72
మాచర్ల	37.53
గుంటూరు	381.03
మంగళగిరి -తాడేపల్లి	68.21
తెనాలి	61.61
పొన్నూరు	22.10
చీరాల	32.98
బాపట్ల	25.32
రేపల్లె	45.74
అద్దంకి	5.10

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.





కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను

- సంయుక్త

'అఖండ 2: తాండవం' చిత్రంలో అవ కాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సిని మాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుద లవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడి యాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీల కంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటు డిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహరాజ్' నా ఫేవ రేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకు లను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడ లేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2
టికెట్ ధరల పెంపు

- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటిం చిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతి చ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రి బ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీ ప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపు దిద్దుకున్న చిత్రం 'గోట్'. సుడి గాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగ ళవారం నిర్మాత దిల్‌రాజు టీజ ర్‌ను విడుదల చేసి, యూని ట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భు తంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడు దల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సిని మాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళ వారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పు డున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాదరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే




రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కి స్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తి యాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్ల డిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొ న్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్వి స్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్ర సాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవు తోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విల న్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ



రణ్‌వీర్ క్షమాపణలు

కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశా లను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతా ర'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేష నల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్ర లోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సిని మాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చా డని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.



వినూత్నంగా వన్ బై ఫోర్

నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెర కెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడు దలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

వైసీపీ అధినేతకు మండలి చైర్మన్ స్వామి భక్తి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిపై స్వామి భక్తి చూపుతున్నారని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. పొన్నూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాజీనామా చేసిన ఎమ్మెల్సీలపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని శాసన మండలి స్పీకర్‌ను హైకోర్టు ఆదేశించిందన్నారు. రాజీనామా చేసి ఏడాది గడుస్తున్నా ఎమ్మెల్సీల రాజీనామాలపై నిర్ణయం తీసుకోకపోవడం వల్ల ఒక సభ్యుడు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. దాంతో ఈ పరిస్థితి తలెత్తిందని అన్నారు. శాసన మండలి స్పీకర్ ఎన్నడూ లేని విధంగా సంప్రదాయాలకు విరుద్ధంగా శాసన మండలి సభ్యులకు కౌన్సిలింగ్ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. చైర్మన్ స్థానంలో ఉన్న వ్యక్తి రాజీనామా చేసిన సభ్యులు వ్యక్తిగతంగా చేశారా లేక ఎవ్వరి ఒత్తిడితోనైనా నిర్ణయం తీసుకున్నారా అని మాత్రమే చూడాలని, కాని మోషేన్ రాజు మాత్రం జగన్మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. రాజీనామా చేసిన ఎమ్మెల్సీలపై నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు పార్టీలకు అతీతంగా రాజ్యాంగ బద్ధంగా పనిచేయాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు.

హత్య కేసు నిందితులకు రిమాండ్

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధూళిపాళ్ళలో తల్లీ కొడుకుల హత్య కేసులో నిందితులైన చెరుకూరి రోహిత్ చౌదరి, సాతులూరి రవికుమార్, షేక్ జావెద్ ఇస్లాంలను అరెస్టు చేసి మంగళవారం గుంటూరులోని జువైనల్ కోర్టులో హాజరు పరిచినట్టు రూరల్ పోలీసులు తెలిపారు. నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించారని పోలీసులు తెలిపారు.

కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత

● జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం



బహుమతులు పొందిన విద్యార్థులతో నజీనా బేగం, రామచంద్ర రాజు తదితరులు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం కోరారు. జాతీయ కాలుష్య నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా కాలుష్య నియంత్రణ మండలి బోర్డు (ఏపీపీసీబీ) ఆధ్వర్యంలో కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యావరణ చట్టాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. పరిశ్రమలు పర్యావరణ సురక్షిత మార్గాలను అవలంబించాలని సూచించారు. రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు మాట్లాడుతూ, మొక్కలు నాటడం, పరిరక్షించడం వంటి విలువలను విద్యార్థి దశ నుంచే అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు కాలుష్యంతో కలిగే ప్రమాదాలపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.హేమాబా, పర్యావరణ కోఆర్డినేటర్ ఎన్.తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువతరానికి ఆదర్శంగా చంద్రబాబు ప్రస్థానం

● దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీలో చీఫ్ విప్ జీవీ ● శివశక్తి ద్వారా స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని ప్రకటన



దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంకల్పం, సత్యం, నిరంతరం శ్రమ సాధనాలుగా నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కొనియాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా 15 సంవత్సరాల 'బంగారు పాలన' పూర్తి చేసుకున్న సందర్భంగా వినుకొండలో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు 40 ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, చంద్రబాబు స్ఫూర్తితో తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. దివ్యాంగులకు సైకిళ్ల పంపిణీకి ముందుకు వచ్చిన శివశక్తి ఫౌండేషన్ చైర్‌పర్సన్, తన సతీమణి లీలావతిని ఈ సందర్భంగా జీవీ అభినందించారు. ఫౌండేషన్ ద్వారా 28 ఏళ్లుగా నిరంతరాయంగా సేవలు చేయడం గొప్ప విషయమని, ఇదే స్ఫూర్తితో నియోజకవర్గంలో చదువుకునే దివ్యాంగులు, మైనార్టీ విద్యార్థినులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు అందజేస్తామన్నారు. స్కాలర్‌షిప్‌ల కోసం వారం రోజుల్లో శివశక్తి మేనేజర్‌ను కలసి అప్లికేషన్‌లు ఇవ్వాలని సూచించారు. అనంతరం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ, 15 ఏళ్ల పాటు మచ్చలేకుండా ముఖ్యమంత్రిగా సేవలు అందించిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు అండగా ఉంటున్న జీవీ లాంటి వ్యక్తి వినుకొండకు జీవితకాలం ఎమ్మెల్యేగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశీను రాయల్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర మహిళా దొంగ అరెస్టు

● రూ.15లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం



నిందితురాలి వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ బీ ఉమామహేశ్వర్

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాలలో దొంగతనాలకు పాల్పడుతున్న మహిళను బాపట్ల జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె నుంచి రూ. 15 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని, వివరాలను ఎస్పీ బి.ఉమామహేశ్వర్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి పట్టణానికి చెందిన కర్రెద్దుల లిల్లీ అలియాస్ గండికోట పద్మ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో దొంగతనాలకు పాల్పడుతోంది. ఇటీవల బాపట్ల జిల్లాలోని పలు బస్టాండ్‌లలో ప్రయాణికుల దృష్టి మరల్చి వారి పర్సులు, బంగారు ఆభరణాలను కాజేసింది. దొంగతనాలకు సంబంధించి ఫిర్యాదులు రావడంతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల సమాచారం ఆధారంగా నిందితురాలిని మంగళవారం ఇంకొల్లు ఆర్టీసి బస్టాండ్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇంకొల్లు, అద్దంకి, నరసరావుపేట వన్‌టౌన్, కాకినాడ జిల్లాలోని తుని పోలీసుస్టేషన్‌ల పరిధిలో దొంగతనాల కేసులు నమోదై ఉన్నాయి, ఆమె నుంచి మొత్తం 5 కేసులకు సంబంధించి రూ. 15 లక్షల విలువైన 136 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వెల్లడించారు.

హైడ్రోఫోనిక్స్ సాగుపై శిక్షణ



హైడ్రోఫోనిక్స్ సాంకేతిక సాగు, నర్సరీ మేనేజ్‌మెంట్‌పై క్షేత్రస్థాయిలో వివరిస్తున్న శాస్త్రవేత్తలు

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో హైడ్రోఫోనిక్స్ సాంకేతిక సాగు, నర్సరీ మేనేజ్‌మెంట్‌పై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నీటి కొరత, భూమి తగ్గుదల వంటి సమస్యల మధ్య రైతులు ఆధునిక సాగు విధానాలవైపు దృష్టి సారిస్తున్న నేపథ్యంలో కళాశాలలో మంగళవారం నిర్వహించిన శిక్షణలో రైతులకు, గృహిణులకు, నిరుద్యోగ యువతకు హైడ్రోఫోనిక్స్ సాగుపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో హైడ్రోఫోనిక్స్ ప్రయోజనాలు, స్వయం ఉపాధి అవకాశాలు, నర్సరీ మేనేజ్‌మెంట్ గురించి నిపుణులు వివరించారు. హైడ్రోఫోనిక్స్ అంటే మట్టికి బదులుగా నీటిలో పోషకాలు కలిపి మొక్కలను పెంచే ఆధునిక సాగు పద్ధతి. దీనిని తక్కువ స్థలంలో సాగు చేయొచ్చని, ఎక్కువ దిగుబడి సాధించవచ్చని, 80 శాతం నీటిపొదుపు, కీటకాల ప్రభావం తక్కువ, మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తాయని శాస్త్రవేత్తలు వివరించారు. ముఖ్యంగా లెట్యూస్, బోక్‌చోయ్, బేసిల్, రెడ్‌బెల్ పెప్పర్ వంటి విదేశీ కూరగాయలు శుభ్రమైన పద్ధతిలో పండించవచ్చన్నారు. వీటికి హోటల్స్, ఆర్గానిక్ మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి స్మిత్, డాక్టర్ కె.కృపావతి, డాక్టర్ రవిబాబు, డాక్టర్ బి.శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ కెవి.రామిరెడ్డి,డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, ఎం.కారుణ్య తదితరులు పాల్గొని శిక్షణ ఇచ్చారు.

జువాలజీలో సునీతకు పీహెచ్‌డీ



ఏఎన్‌యూ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం జువాలజీలో ఎన్.సునీతకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది. ఏఎన్‌యూ జువాలజీ సీనియర్ ఆచార్యుడు కె.సుమంత్ కుమార్ పర్యవేక్షణలో సునీత పంగాసియానోడాన్ హైపోథాలమస్ (పాలచేప, పంగస్ చేప) చేపల్లో ఆహార లిపిడ్ల ప్రభావం, సంతానోత్పత్తి సామర్థ్యం, జీవక్రియ పనితీరు, పోషక వినియోగంపై పరిశోధనలు పూర్తి చేశారని పరిశోధన విభాగం సమన్వయకర్త డాక్టర్ పి.సుధాకర్ మంగళవారం తెలిపారు. పీహెచ్‌డీ పట్టాను అందుకున్న సునీతను పలువురు అభినందించారు.

6,8వ తేదీలలో అంతర్ కళాశాలల ఉత్సవాలు

ఏఎన్‌యూ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్ కళాశాలల యువజన ఉత్సవాలు 2025-26 ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 6, 8వ తేదీలలో జరుగుతాయని యువజన ఉత్సవాలు కోఆర్డినేటర్ మురళీ మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కళాశాల నుంచి గరిష్ఠంగా 32 మందికి మించకుండా పాల్గొనవచ్చని తెలియజేశారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు భోజనం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

7న జాతీయ ఉపకార వేతన పరీక్ష

నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన (ఎస్ఎంఎంఎస్) పరీక్షను ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మంగళవారం తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్లను సంబంధిత వెబ్‌సైట్ నుంచి లేదా వాట్సాప్-మనమిత్ర నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి తమ పాఠశాలకు చెందిన విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసి అందించొచ్చని చెప్పారు. విద్యార్థులు సవరణలు ఏమైనా ఉంటే పాఠశాల ప్రధానోపాధ్యాయులిచ్చిన ధ్రువీకరణ లేఖతో పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌ను కలవాలని అన్నారు. హాల్ టికెట్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం వివరాలు తెలుస్తాయని డీఈవో చంద్రకళ తెలిపారు.

ఆర్‌టీఐహెచ్‌లో ఇన్నోట్రైబ్ ప్రారంభం



రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో జరిగిన రాష్ట్రవ్యాప్త విద్యార్థి ఆవిష్కరణోద్యమం కార్యక్రమంలో పాల్గొన్న సీఈవో ధాత్రి రెడ్డి

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్నోట్రైబ్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో ఐఏఎస్ అధికారి పి.ధాత్రి రెడ్డి మంగళవారం మంగళగిరి ఆర్‌టీఐహెచ్‌లో అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇన్నోట్రైబ్ విద్యార్థులలో ప్రయోగాలపై ఉత్సుకత, ఆచరణాత్మక ఆవిష్కరణలను ప్రేరేపించే ఒక ఉద్యమమని చెప్పారు. విద్యార్థి ఆవిష్కర్తలకు ప్రత్యేక గ్రాంట్లుగా రూ. 3 కోట్ల నిధిని కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి ఆర్ సుబ్రహ్మణ్యం, ఎస్ఆర్ఎం-ఏపీ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ సతీష్ కుమార్, ఏఐసీటీఈ నుంచి డాక్టర్ నవీన్ కుమార్, ఎన్ఆర్‌డీసీ నుంచి డాక్టర్ టీకే సాహూ పాల్గొన్నారు.

గోల్డ్ క్లస్టర్‌లో కామన్ ఫెసిలిటీ సెంటర్

● రాష్ట్ర వాటాగా రూ.74.95 లక్షలు మంజూరు

మంగళగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి గోల్డ్ ఆర్నమెంట్స్ క్లస్టర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.9.99 కోట్ల వ్యయంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు కానుంది. ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 15 శాతం, ఎస్‌పీవీ 5 శాతం నిధులు మంజూరు చేయనున్నాయి. రాష్ట్ర వాటా రూ.1.49 కోట్లు కాగా, సగం నిధులు రూ.74.95 లక్షలను తొలి విడతగా మంజూరు చేస్తూ ఏపీ పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ముగిసిన దివ్యాంగుల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ స్టేడియంలో గత రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి దివ్యాంగుల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారం ముగిశాయి. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సంక్షేమ శాఖ ఏడి దుర్గాబాయి, పారా స్పోర్ట్స్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, కోచ్ సెక్షన్ అధికారి బి.శ్రీనివాసరావు హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ, దివ్యాంగులలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ క్రీడలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. గెలుపొందిన క్రీడాకారులను జాతీయ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్, కోచ్‌లు, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు.



షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో విజేతలతో గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

సాగు.. బాగు.. ఎలా

(3వ పేజీ తరువాయి)

సబ్సిడీలు కోరుకుంటున్నారు.. అన్న అంశాలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. చర్చావేదికలో రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని 2025-26 రబీ, 2026 ఖరీఫ్, 2026-27 రబీ సీజన్‌లో పంటల సాగుపై ఈ వర్క్‌షాప్‌లో సాగు ప్రణాళికలను గ్రామాల వారీగా రూపొందించనున్నారు. గ్రామ యూనిట్‌గా భూసార వివరాలను సేకరిస్తారు. భూసార పరీక్షల ఆధారంగా ఏ ప్రాంతంలో ఏ సూక్ష్మపోషకాల లోపాలు ఉన్నాయో నిర్ధారించి వచ్చే ఖరీఫ్‌లో వాటి పంపిణీకి ప్రతిపాదనలు రూపొందించనున్నారు. ఏ పంటకు ఏ రకం ఎరువులు ఎంత వినియోగిస్తున్నారో కూడా రైతుల నుంచి సేకరించనున్నారు. గ్రామంలో సాగుకు అవసరమైన యంత్రపరికరాలు ఏస్థాయిలో ఉన్నాయో అంచనా వేస్తారు. ఇవి ఏ మేరకు సరఫరా చేయాలో కూడా గుర్తించనున్నారు. సాగుకు సంబంధించిన అన్ని అంశాలను చర్చావేదికలో చర్చించి భవిష్యత్ ప్రణాళికలను రూపొందించేందుకు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు సమాయత్తమయ్యారు. ఒక్కొక్క ఆర్ఎస్‌కేలో 100 నుంచి 200 మంది రైతులు హాజరవుతారని అధికారులు తెలిపారు.

అవగాహన అంశాలు..

ఈ చర్చావేదికల ద్వారా రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించింది. పంటల సాగులో మెలకువలు తెలియజేయడంతో పాటు సాగు వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు అవగాహన కల్పించనున్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించడంపై రైతులను చైతన్య పరచనున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా రైతులకు సాగుపై అవగాహన కల్పించనున్నారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పశు వ్యర్థాలతో పాటు పచ్చిరొట్ట సాగు చేయాలని రైతులకు సూచించనున్నారు. రసాయన ఎరువులు లేకుండా ప్రకృతి వ్యవసాయం చేయాలని అవగాహన కల్పించనున్నారు. ఎరువుల తక్కువ వినియోగం వల్ల కలిగే లాభాలతో పాటు సేంద్రియ విధానం ద్వారా పండించిన ఉత్పత్తులకు విదేశాల్లో ఏ స్థాయిలో డిమాండ్ ఉందనేది వివరించనున్నారు. శాస్త్రీయ వ్యవసాయంతోనే గిట్టుబాటు అవుతుందని, ఆధునిక పద్ధతుల ద్వారా పంటలకు మరింత విలువ జోడించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించనున్నారు. ప్రకృతి సాగుతో భూసార రక్షణతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందని ఈ దిశగా రైతులను చైతన్యపరచనున్నారు.

రౌడీషీటర్ సలీంపై దాడి

● పాత గొడవల నేపథ్యంలో ఘటన



రౌడీషీటర్ సలీంకు చికిత్స అందిస్తున్న వైద్యులు

పొన్నూరుటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన రౌడీషీటర్ సలీంపై ప్రత్యర్థులు విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. పొన్నూరు అర్బన్ సీఐ ఎల్ వీరా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం, పట్టణంలోని ఐదో వార్డు డఫ్‌పేటకు చెందిన షేక్ సలీం కళ్లలో కారం కొట్టి అదే వార్డుకు చెందిన షేక్ కరిముల్లా, హజమతుల్లా, ఆరీఫుల్లా, పప్పు అనే వ్యక్తులు మంగళవారం ఇనుప రాడ్లు, రాళ్లు, బండలతో తలపై విచక్షణారహితంగా దాడి చేశారు. దాడి జరుగుతున్న సమయంలో స్థానికులు కేకలు వేయడంతో నిందితులు ఘటనా స్థలం నుంచి పరారయ్యారు. దాడిలో తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో పడి ఉన్న సలీంను స్థానికులు, బంధువులు హుటాహుటిన నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అర్బన్ సీఐ ఎల్ వీరా నాయక్ తెలిపారు. అయితే దాడికి పాత గొడవలే కారణమని తెలుస్తోంది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం నాటికి 579.70 అడుగులు ఉంది. ఇది 282.14 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8,023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5,226 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,557 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,006 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లోగా 44,006 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 43.54 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 400 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోందని, ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా అదే మొత్తంలో దిగువ కృష్ణకు విడుదలవుతోందని ఆయన తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి



మహేశ్‌బాబు (ఫైల్‌ఫొటో)

శావల్యాపురం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పొలంలో దమ్ము చేసేందుకు వెళుతున్న వీల్సు ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీ కొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన శావల్యాపురం మండలం కృష్ణాపురంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ లేళ్ళ లోకేశ్వరరావు వివరాల ప్రకారం, మండలంలోని బొందిలిపాలెం గ్రామానికి చెందిన ఒత్తుల మహేశ్‌బాబు (19) జీవనోపాధి నిమిత్తం ఐదేళ్లుగా పేరేచర్లలో ఉంటున్నాడు. ఆధార్ అప్‌డేట్ నిమిత్తం సోమవారం వినుకొండలోని తన పిన్ని ఇంటికొచ్చాడు. మంగళవారం తిరిగి పేరేచర్లకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై కృష్ణాపురం వద్ద ముందు వెళుతున్న వీల్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని తెలిపారు. వీల్సు ట్రాక్టర్‌ను జాతీయ రహదారిపైకి తీసుకురావడం నేరమని, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

43,642 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 45,716 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,642 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,317 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	11000	15000
273	----	----
341	10500	17000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15500
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	17300
దేవనూరు డీలక్స్	11000	16800
ఆర్మూరు	10500	13300

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	11000	17200
నెంబరు. 5	10500	15800
273	----	----
341	12000	16800
4884	12000	14200
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	15000
బ్యాడిగి 355	11000	17300
దేవనూరు డీలక్స్	10500	16300
తాలుకాయలు	5000	7800

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పీఎం ఆవాస్ యోజనకు దరఖాస్తు గడువు పెంపు

కారంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పీఎం ఆవాస్ యోజన - ఎన్టీఆర్ పథకానికి దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 14వ తేదీ వరకు పెంచిందని హౌసింగ్ ఏఈ బాబురావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గృహాలు నిర్మించుకోవడానికి దరఖాస్తు చేసుకునేందుకు మండల కార్యాలయం లేదా గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులను సంప్రదించాలన్నారు. సొంతిల్లు లేని పేద కుటుంబాలకు గృహ నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికసాయం అందిస్తున్నాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు.

నేడు 'రైతన్నా మీకోసం'

బెల్లంకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవాకేంద్రం వద్ద రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో సునీత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సచివాలయం వద్ద రైతు సేవాకేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రైతులు తప్పకుండా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

5న ఎమ్మెల్యే పాపాయపాలెం రాక

బెల్లంకొండ మండలంలోని పాపాయపాలెం గ్రామానికి ఈనెల 5వ తేదీన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వంద గ్రామాల వంద రోజుల పర్యటన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు.

వెలుగు సీసీలతో ఏపీఎం సమీక్ష



సీసీలకు సూచనలు చేస్తున్న ఏపీఎం రంగారెడ్డి

దుర్గి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం సీసీలకు ఏపీఎం వెంకట రంగారెడ్డి ఆధ్వర్యాన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సీసీలకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న రికవరీలను త్వరగా ట్రాన్స్‌ఫర్ చేయించాలన్నారు. రెగ్యులర్ రికవరీలను ఈనెల 5వ తేదీలోపు ట్రాన్స్‌ఫర్ చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో సీసీలు నరేష్‌రెడ్డి, శ్యాంసన్, లక్ష్మీనాయక్, అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహం దగ్ధం

విజయపురిసౌత్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీ బ్లైపులో నివాసముంటున్న చల్లా రాజు అనే వ్యక్తి గృహం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. మంగళవారం వేకువ జామున ఈ ఘటన జరిగింది. రాజు మాల ధరించి ఉండడంతో వేకువ జామున స్నానానికి కృష్ణానదికి వెళ్లారు. గృహంలో విలువైన ఎలక్ట్రికల్ సామాగ్రి, 10.4 గ్రాముల బంగారం, కొంత నగదు బూడిద అయిపోయింది. రాజు భార్య అంజలి మంటల్లో చిక్కుకొని స్పృహ కోల్పోయింది. భారీగా పొగ రావడంతో స్థానికులు మంటలను అదుపు చేసేందుకు నీరు చల్లారు. స్పృహ కోల్పోయిన అంజలిని స్థానిక ప్రాజెక్ట్ వైద్యశాలకు తరలించారు. అంజలి కుడి చేయి కాలిపోయింది.

బడి బస్సుల తనిఖీ..

రూ.15 వేల అపరాధ రుసుం విధింపు

రెంటచింతల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రెంటచింతలలోని పలు పాఠశాలలకు చెందిన బస్సులను మాచర్ల ఎంవీఐ డి.శేషిరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. మిట్టగుడిపాడు రోడ్డులో బస్సులను నిలిపివేసి డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. అత్యవసర ద్వారం వెంటనే తెరుచుకోవాలని, బస్సు అద్దాల వద్ద పాయింట్ డైమండ్ హ్యామర్(సుత్తి) ఉండాలని, హ్యాండ్ బ్రేక్ పని చేయాలని, హెవీ లైసెన్సు ఉన్నోళ్లు మాత్రమే డ్రైవర్లుగా ఉండాలన్నారు. అనంతరం పలు ప్రైవేట్ వాహనాలను తనిఖీ చేసి ఓవర్ లోడ్ కారణంగా రూ.15 వేలు అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగించుకోవాలి : సీఐ

అచ్చంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ స్ఫూర్తితో విద్య, ఉపాధి ఉద్యోగాల్లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో అభివృద్ధి సాధించవచ్చునని అచ్చంపేట మండల సీఐ పీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నియోజకవర్గ దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కన్వీనర్ సందెపోగు అశోక్, డీబీఆర్‌సీ బుక్‌లెట్‌ను సీఐకి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ డీబీఆర్‌సీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని, వీటి ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందవచ్చునని తెలిపారు. ప్రజలు సంక్షేమం, అభివృద్ధి, రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

మురుగు కాలువలో పసికందు మృతదేహం

కారంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కారంపూడి ఎస్సీ కాలనీ మురుగు కాలువలో సోమవారం పసికందు మృతదేహం లభ్యమైంది. ఇది చూసి చలించిపోయిన స్థానికులు రోజుల వయసులో ఉన్న పసికందును మురుగు కాలువ నుంచి బయటకు తీసి పూడ్చివేశారు.

వృద్ధులపై ప్రేమతో మెలగాలి

పెదకూరపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వృద్ధులపై ప్రతి వారు ప్రేమతో మెలగాలని జనచైతన్య సమితి కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని హుస్సేన్ నగరంకు చెందిన సత్తెనపల్లి ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు మంచాల రమేష్ జన్మదినం సందర్భంగా సత్తెనపల్లిలోని ఆదరణ వృద్ధాశ్రమంలో మంగళవారం రాత్రి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు, ఆశ్రమ నిర్వాహకులు కొమ్మవరపు రిషిత తదితరులున్నారు.

ధాన్యం సేకరణకు 12 క్లస్టర్లు

- సబ్ డివిజన్లో ముమ్మరంగా వరికోతలు
- ఆరు వేల హెక్టార్లలో ఖరీఫ్ సాగు



కుప్పగా పోసిన ధాన్యం రాసులు



మిషన్‌తో కోస్తున్న వరి

క్రోసూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండ లాల్లో ధాన్యం సేకరణ కోసం 12 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. క్రోసూరు మండలంలో క్రోసూరు, ఆవుల వారిపాలెం, అచ్చంపేట మండలంలో అచ్చంపేట, అమరావతి మండలంలో మునగోడు, బెల్లంకొండ మండలంలో నాగిరెడ్డిపాలెం, మాచాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, రాజుపాలెం మండలంలో కోట నెమలిపురి, బలిజేపల్లి, అంచులవారిపాలెం, ఇనిమెట్ల క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లోని రైతు సేవా కేంద్రాల్లో తేమశాతం కొలిచే మీటర్లను ఉంచారు. రైతులు రైతు సేవాకేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకు వెళ్ళి తేమశాతాన్ని నిర్ధారించు కోవటమే కాక ధాన్యం విక్రయం కోసం యాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రైతు సేవా కేంద్రాల సిబ్బంది దీనికి సహాయం చేయనున్నారు. ప్రభుత్వం ఈ సంవత్సరం మాగాణికి వంద కిలోలకు గ్రేడు రకానికి రూ 2,389, 75 కిలోల బస్తాకు రూ.1792, సాధారణ రకానికి వంద కిలోల బస్తాకు రూ 2,369, 75 కిలోల బస్తాకు రూ.1777 మద్దతు ధరగా ప్రకటించింది. గత సంవత్సరం కంటే రూ.77 అదనంగా మద్దతు ధర ప్రకటించినట్టు అధికారులు చెపుతున్నారు. క్రోసూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆరు వేల హెక్టార్లలో వరి పంటను వేశారు. 15 రోజుల నుంచి ఐదు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ముమ్మరంగా వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి యాప్‌లలో నమోదు చేసుకొనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇదిలా ఉండగా ప్రైవేట్ వ్యాపారులు కూడా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు రంగంలోకి దిగారు. ప్రైవేట్ వ్యాపారులు 25 శాతం వరకు తేమ శాతాన్ని అనుమతిస్తుండగా ప్రభుత్వ ధాన్యం సేకరణ కేంద్రాల్లో మాత్రం తేమ శాతాన్ని బట్టి క్వింటాల్‌కు 5 కిలోల వరకు కోత విధిస్తున్నట్టు రైతులు చెపుతున్నారు. ఈ సంవత్సరం వరి కోతలకు అధికంగా మిషన్‌లను ఉపయోగిస్తున్నారు. అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో మాత్రమే కూలీలతో వరి కోతలు జరుగుతున్నాయి. మొత్తం మీద వచ్చే నెల రోజుల్లో వరి కోతలు ముమ్మరమయ్యే అవకాశం ఉంది.

ప్రజా సమస్యలపై అర్జీల వెల్లువ

- వంద గ్రామాలు.. వందరోజుల కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



గ్రామస్థుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'ప్రజల వద్దకు ప్రవీణ్' పేరుతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేపట్టిన వంద గ్రామాలు వందరోజుల కార్యక్రమం మంగళవారం కర్లపూడి గ్రామంలో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రవీణ్ ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో గ్రామస్థుల సమస్యలపై అర్జీలు స్వీకరించగా 210మంది వివిధ సమస్యలపై దాఖలు చేశారు. కర్లపూడి నుంచి అనంతవరం వెళ్లే మార్గం శిథిలావస్థకు చేరిందని, తమ బజారులో తాగునీరు రావడం లేదని, నివాసస్థలం లేదని, ఇంటిని మంజూరు చేయాలని, విద్యుత్ స్తంభం తొలగించాలని, దేవాలయ భూమి ఆక్రమణకు గురైందని, హెల్త్‌సెంటర్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని, పెన్షన్ రావడం లేదని, అన్నదాత సుఖీభవ తమ ఖాతాలో జమకాలేదని అర్జీలు దాఖలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులను ఆదేశించామని, అర్హులైన వారికి ప్రతిఒక్కరికి సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డానియేలు, ఎంపీడీవో పార్వతి, ఎంఈవో ప్రసాద్, శివబాబు, ఏవో అహ్మద్, ట్రాన్స్‌కో ఏఈ రవికిరణ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భూ సమీకరణకు సత్వర చర్యలు ప్రారంభం

రెండో దఫా భూసమీకరణకు ప్రభుత్వం సత్వర చర్యలు ప్రారంభించిందని అందుకు సంబంధించిన జీవోను విడుదల చేసిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం రెండో దఫా భూసమీకరణ జరిగే గ్రామాల్లో ఒకటైన కర్లపూడిలో భూ సమీకరణకు సంబంధించి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. కర్లపూడి వైకుంఠపురం గ్రామాల రైతుల విన్నపం మేరకు భూసమీకరణపై ముఖ్యమంత్రితో చర్చించి ఒప్పించామని వాటితో పాటు మధ్యలో ఉన్న పెదమద్దూరు, ఎండ్రాయి గ్రామాలను కూడా పూలింగ్ పరిధిలోకి తీసుకువచ్చారన్నారు. భావితరాలకు ఆదర్శవంతమైన రాజధానిని నిర్మించే దిశగా అదనంగా 16వేల ఎకరాలు సమీకరిస్తారన్నారు. గ్రామానికి చెందిన రైతు కూలీలు భూ సమీకరణ జరిగితే తమకు జీవనోపాధి ఎలా అని ఎమ్మెల్యేను వివరణ కోరారు. ఎమ్మెల్యే సమాధానం చెపుతూ రెండు సంవత్సరాల వరకు పెన్షన్ అందజేస్తామని తరువాత ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. నాలుగు రెవెన్యూ గ్రామాలను భూసేకరణకు ఎంపిక చేయడంపై గ్రామస్థులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజు, నరుకుళ్లపాడు, మునగోడు పీఏసీఎస్ చైర్‌పర్సన్స్ భాష్యం జగదీష్, నాగోతు నాగార్జున, శౌరయ్య, విష్ణు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సైకిల్‌పై శబరిమలై చేరిన సర్పంచ్ లక్ష్మీనారాయణ

- రోజుకు తొమ్మిది గంటలు ప్రయాణం.. తొమ్మిది రోజులకు కేరళకి



సైకిల్‌పై ప్రయాణిస్తున్న కిష్టంశెట్టి లక్ష్మీనారాయణ

దాచేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని శబరిమలై చేరుకొనేందుకు అయ్యప్ప దీక్షను తీసుకున్న గ్రామ సర్పంచ్ కిష్టంశెట్టి లక్ష్మీనారాయణ సైకిల్‌పై బయల్దేరి వెళ్లాడు. సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు, గ్రామ సర్పంచ్ కిష్టంశెట్టి లక్ష్మీనారాయణ అయ్యప్ప స్వామి మాలధారణ చేశాడు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొందని తెలిపాడు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పేదలకు ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తుందని తెలిపారు. ఇంతటి మంచి ప్రభుత్వాన్ని అందించిన అయ్యప్ప స్వామికి మొక్కులు చెల్లించుకొనేందుకు సైకిల్‌పై తక్కెళ్ళపాడు నుంచి కేరళలోని శబరిమలైకు సైకిల్‌పై ప్రయాణం చేసినట్లు వివరించారు. నవంబరు 23న ప్రారంభమైన సైకిల్ యాత్ర డిసెంబరు 2వ తేదీ నాటికి కేరళలోని ఎరిమేలి వరకు చేరుకున్నానని వివరించారు. బుధవారం నాటికి శబరిమలై కొండకు చేరుకుంటానని వివరించారు. రోజుకు తొమ్మిది గంటల పాటు సైకిల్ తొక్కుకుంటూ రోజు వంద నుంచి 150 కిలో మీటర్లు ప్రయాణం చేశానని ఫోన్‌లో వివరించారు. ఈ సైకిల్ యాత్రకు స్థానికుల నుంచి ప్రశంసలు అందుతున్నాయి.

పొలాలను పరిశీలించిన నాబార్డు అధికారుల బృందం



గోలి గ్రామంలో పంట పొలాలను పరిశీలిస్తున్న నాబార్డు అధికారుల బృందం

రెంటచింతల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోలి గ్రామంలో నాబార్డు, నేస్తం ఫౌండేషన్‌కు చెందిన అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. సాగులో ఉన్న పంట పొలాలను పరిశీలించారు. సాగు నీటి కాలువల సౌకర్యం ఉందా.. లేదా, బోరు వేస్తే ఎన్ని వందల అడుగుల్లో నీరు లభ్యమవుతుందని అన్నదాతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బ్యాంకు రుణాలను గురించి అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే ఇతరులకు మేలు చేసిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం శరత్‌బాబు, నేస్తం ఫౌండేషన్ సీఈవో వి సురేష్, గోపి, ఉద్యాన శాఖ సహాయ అధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో నీటి శాంపిల్స్ సేకరించిన అధికారులు

దాచేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిలో రసాయన వ్యర్థాలు కలవటంపై అధికారులు శ్యాంపిల్స్‌ను సేకరించారు. మంగళవారం అధికారులు తెలియజేస్తూ కృష్ణానదిని సందర్శించి కలుషిత నీరు ఏ ప్రాంతం నుంచి వస్తుంది, ఏ పరిశ్రమలకు సంబంధించిన కలుషితాలు ఇందులో ఉన్నాయి?, పోలీసుల సహకారంతో దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు. ఇప్పటికే సిమెంట్ ఫ్యాక్టరీల సిబ్బందిని పిలిపించి విచారించినట్టు పేర్కొన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో వ్యర్థాలను డంప్ చేశారా? అంటూ ఆరా తీశారు. దాచేపల్లి నగర పంచాయతీలోని దుర్గా భవానీ కాలనీ, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్నా కెమికల్ ఫ్యాక్టరీలో కూడా విచారణ చేపట్టారు. కలుషిత నీరు వివరాలు సేకరించి పూర్తి వివరాలు కలెక్టర్‌కు అందజేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, మైనింగ్ ఏడీ ప్రకాష్ వివరించారు.

టీడీపీ సీనియర్ నేత మద్దినేని సైదారావు జ్వరంతో మృతి



మద్దినేని సైదారావు (ఫైల్‌ఫొటో)

రెంటచింతల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మకోట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మద్దినేని సైదారావు(42) జ్వరంతో బాధపడుతూ సోమవారం రాత్రి మాచర్ల పట్టణంలోని ఆసుపత్రిలో మృతి చెందాడు. కొద్ది రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న సైదారావు సోమవారం మాచర్ల వెళ్లి చికిత్స పొందాడు. అవివాహితుడైన సైదారావు గడిచిన సాధారణ ఎన్నికల్లో 207 బూత్‌కు టీడీపీ తరఫున ఇన్‌చార్జిగా వ్యవహరించారు. సైదారావు ఆకస్మిక మరణంపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. తండ్రి వెంకయ్యను ఫోన్‌లో పరామర్శించారు.

బయోడీజిల్ పేలుళ్లలో గాయపడిన భాగ్యారావు మృతి



భాగ్యారావు (ఫైల్)


రెంటచింతల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలువాయిజంక్షన్‌లో బయోడీజిల్‌ప్లాంట్‌లో పేలుళ్లకు సంబంధించి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న సంగం భాగ్యారావు (52) మంగళవారం మృతి చెందారు. గత నెల 23న జంక్షన్లో బయోడీజిల్ ప్లాంట్‌లో ట్యాంకర్ నుంచి ఆయిల్‌ను పైప్ ద్వారా క్యాన్లలోకి నింపుతున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. భాగ్యారావు గాయాలతో పిడుగురాళ్లలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

5న మెగా పీటీఎం సమావేశం

జడ్పీ హైస్కూల్‌కు హాజరుకానున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) ఈ నెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జరిపేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య సంబంధాలను బలపరచడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి వికసిత్ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పంలో భాగంగా ఈ నెల 5వ తేదీన మెగా పీటీఎం కార్యక్రమం అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో నిర్వహించనున్నారు. పల్నాడు జిల్లాలో సుమారు 2 వేల మంది విద్యార్థులు ఉన్న పిడుగురాళ్ల జడ్పీ హైస్కూల్లో జరిగే పీటీఎం కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఆ రోజున ఏమేమి చేయాలో ప్రణాళికను విద్యాశాఖ ఇప్పటికే పాఠశాలలకు ఆదేశాలు ఇచ్చింది.

శ్రీపాత పాటేశ్వరమ్మ తిరునాళ్ల రేపు



శ్రీపాత పాటేశ్వరి అమ్మవారు

గురజాలటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీపాతపాటేశ్వరి అమ్మవారికి ప్రతి సంవత్సరం మార్గశిర శుద్ధ ఏకాదశి నుంచి మార్గశిర శుద్ధపౌర్ణమి వర కు తిరునాళ్ల, బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈనెల 4వ తేదీన అమ్మవారి తిరునాళ్లను వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఇదే రోజున గురజాల పట్టణ తిరునాళ్లగా ప్రజలు జరుపుకుంటారు. అమ్మవారి సిడిమానుకు రైతులు తమ పొలాల్లో పండించిన గుమ్మడి కాయలు, సొరకాయలు, ఇతర ధాన్యాలు కడతారు. తిరునాళ్లను పురస్కరించుకొని అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. సీఐ ఆవుల భాస్కర్ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరునాళ్లను పురస్కరించుకొని పట్టణంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల బండ లాగుడు పోటీలను కూడా నిర్వహించనున్నారు.

రేపు సీపీఐ జనరల్ బాడీ సమావేశం

దాచేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పల్నాడు జిల్లా జనరల్ బాడీ సమావేశం ఈనెల 4వ తేదీన జరుగుతుందని, ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి కోరారు. మంగళవారం రమణారెడ్డి మాట్లాడుతూ దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని మందపాటి నాగిరెడ్డి కమ్యూనిటీ హాల్లో ఉదయం 10 గంటల నుంచి సమావేశం జరుగుతుందని వివరించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాదు, సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కాసా రాంబాబు తదితరులు హాజరు కానున్నట్టు వివరించారు.

జూలకంటి కుటుంబం ఏమిటో ప్రజలకు తెలుసు

- నేను కంత్రీనయితే జిల్లాలో వైసీపీకి నో ఎంట్రీ బోర్డు పడేది
- మాజీ ఎమ్మెల్యేలపై జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జూలకంటి కుటుంబం ఎటువంటిదో పల్నాడు ప్రజానికానికి, నియోజకవర్గ ప్రజలకు తెలుసునని, మూడు తరాలుగా తమ కుటుంబాన్ని ఆదరిస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నా తండ్రి జూలకంటి నాగిరెడ్డి 1964లోనే ఎమ్మెల్యేగా పనిచేశారని, ఆ తరువాత నా తల్లి దుర్గాంబను, ప్రస్తుతం తనను ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజలు ఆదరించారన్నారు. మీలాంటి కంత్రీ పనులు నేను చేస్తే జిల్లాలో వైసీపీకి నో ఎంట్రీ బోర్డు ఎప్పుడో పెట్టేసే వాళ్లమన్నారు. నియోజకవర్గంలో కక్షసాధింపులు, వేధింపులు, అక్రమ వసూళ్ల నుంచి ప్రజలు విముక్తి పొందారన్నారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో అగ్గి రాజేయాలని వైసీపీ నేతలు చూస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన గుండ్లపాడు జంట హత్యల కేసులో ప్రమేయమున్న పిన్నెల్లి సోదరులను జైల్లో పెట్టకుండా కిరీటాలు పెట్టాలా అంటూ మాజీ ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీల జంట హత్యకు పాల్పడింది మీ నాయకుడు కాదా అంటూ మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లిని ఉద్దేశించి ప్రశ్నించారు. ప్రకాశం జిల్లా చందోలు బౌద్ధ మ్యూజియంలో విగ్రహాలు ఎవరు కాజేశారో అక్కడికి వెళ్లి రికార్డులు పరిశీలించుకోవాలన్నారు. మీ కుటుంబంలో వ్యక్తి చనిపోతే సమాధి కోసం చందాలు వసూలు చేసిన చరిత్ర మీది కాదా అంటూ కాసు మహేష్‌రెడ్డిపై మండిపడ్డారు. ఇప్పటికైనా కారు కూతలు మానుకొని నిజం తెలుసుకొని మాట్లాడాలన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే మాచర్ల నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌రెడ్డిలకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సవాల్ విసిరారు.

రైతు ధాన్యానికి కూటమి ప్రభుత్వం అండ

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న అంజయ్య

కారంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీసీ కమిటీ -4 చైర్మన్ పంగులూరి అంజయ్య అన్నారు. మండలంలోని చింతపల్లి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. రైతు సేవా కేంద్రాలు పూర్తిగా రైతుల కోసమే పనిచేస్తాయన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికి మండలస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు అందించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో మాతా శిశుసంరక్షణకే ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

పిడుగురాళ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. కిల్కారి ప్రోగ్రాం ఆఫీసర్ రాజు మాట్లాడుతూ కిల్కారి కాల్స్ అందరికీ రావాలంటే ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో గర్భిణుల వివరాలు కచ్చితంగా సకాలం లో నమోదు చేయాలని సూచించారు. కిల్కారి కాల్ వచ్చినప్పుడు పూర్తి సమాచారాన్ని వినే గర్భిణులు, బాలింతల సంఖ్య పెరగాలని, దీని కోసం ఆశా, ఏఎన్ఎంలు క్రమం తప్పకుండా ప్రయత్నం చేయాలన్నారు. స్థానిక వైద్యాధికారి ప్రభావతి, పీహెచ్‌ఎన్ ధనలక్ష్మి, హెచ్‌వీ పద్మావతి, ఏఎన్ ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్ డివిజన్‌లోని గ్రామాల్లో నేడు వర్క్‌షాపులు

క్రోసూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల్లో ఉన్న అన్ని గ్రామాల్లో నేడు వ్యవసాయశాఖ వర్క్ షాపులు నిర్వహిస్తుందని క్రోసూరు ఏడీఏ పీ మస్తానమ్మ తెలియజేశారు. నవంబరు 24 నుంచి 29వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో రైతన్న మీ కోసం పేరిట వ్యవసాయ సిబ్బంది సర్వే నిర్వహించారు. 3వ తేదీన ప్రతి గ్రామంలోను 2025-26 ఖరీఫ్ సీజన్‌ను బేరీజు వేసుకొని రబీ సీజన్‌కు ప్రణాళిక సిద్ధం చేసుకోవటం, అలాగే 2026-27 ఖరీఫ్, రబీ సీజన్‌లకు యాక్షన్ ప్లాన్ తయారు చేస్తారని ఆమె తెలియజేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ముగ్గురిపై కేసు నమోదు

ఈపూరు ,డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో కంది పైరుకు గడ్డి మందు కొట్టడంతో పంట ఎండిపోయిన సంఘటన మండల కేంద్రమైన ఈపూరులో జరిగింది. నాసిన పేరమ్మకు చెందిన 1.63 ఎకరాల కంది పైరుకు నాసిన ఏడుకొండలు అతని కుమారులు గోవిందు, రమేష్‌లు కంది పంటకు గడ్డి మందు స్ప్రే చేశారు. పంట పూర్తిగా ఎండిపోయింది. పేరమ్మ ఈపూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ వేణుగోపాల్ కంది పొలాన్ని పరిశీలించారు. వ్యవసాయశాఖ అధికారి ఆర్.రామారావు కూడా ఎండిపోయిన కంది పంటను పరిశీలించారు. పేరమ్మ ఫిర్యాదు మేరకు నాశన ఏడుకొండలు, గోవిందు, రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీసీఐ కొనుగోలు కేంద్రంలో తహసీల్దార్ పరిశీలన

నాదెండ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గణపవరంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ కుటుంబరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. రైతులు తెచ్చిన పత్తిలో తేమ శాతాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు సుమారు ఐదువేల క్వింటాళ్ళ పత్తిని కొనుగోలు చేసినట్టు బయ్యర్ రమేష్ తహసీల్దార్‌కు వివరించారు. రైతులకు సదుపాయాలు కల్పించాలని సిబ్బందిని కోరారు. ఆయన వెంట వీఆర్వోలు ఆదిలక్ష్మి, అంకమ్మరావులు ఉన్నారు.

మోటార్ సైకిళ్లు ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం పాలపాడు వద్ద రెండు మోటారు సైకిళ్ల ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పాలపాడు గ్రామానికి చెందిన నరసయ్యకు, రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామానికి చెందిన లోకేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఇద్దరిని నరసరావుపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తొమ్మిదిమంది జూదరుల అరెస్టు

చిలకలూరిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం కావూరు, బొప్పూడి గ్రామాలలో మంగళవారం రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట శిబిరాలపై దాడులుచేసి కోత ముక్క ఆడుతున్న 9మందిని అరెస్టు చేశారు. కావూరులో నలుగురుని అరెస్టుచేసి రూ.4,500 స్వాధీనం చేసుకున్నారు. బొప్పూడిలో ఐదుగురుని అరెస్టుచేసి రూ.2,800 స్వాధీనం చేసుకున్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

నాదెండ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాదెండ్ల మండల పరిషత్ సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు జరిగే ఈ సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వినుకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని శర్మ స్కూల్‌లో విద్యార్థులకు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ గురించి వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ 1984భోపాల్ గ్యాస్ విపత్తు జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం డిసెంబరు 2వ తేదీన జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శర్మ స్కూల్ ప్రిన్సిపాల్ శర్మ, శానిటరీ సెక్రటరీ రవి, శర్మ స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు, మేస్త్రులు పాల్గొన్నారు.

నేడు రైతన్నా మీ కోసం గ్రామ సభలు

వినుకొండ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 11 రైతు సేవ కేంద్రాలలో గురువారం రైతన్నా మీ కోసం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి వరలక్ష్మి బుధవారం తెలిపారు. 2025-26 రబీ, 2026-27 ఖరీఫ్, రబీ యాక్షన్ ప్లాన్లను తయారుచేయటం జరుగుతుందన్నారు. సర్పంచ్, గ్రామ నాయకులందరూ, రైతు సోదరులు సచివాలయ సిబ్బంది అందరూ పాల్గొంటారని తెలిపారు.

క్రీడా దుస్తులు పంపిణీ

ఈపూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొగ్గరం హైస్కూల్లో క్రీడాకారులకు దుస్తులను గ్రామ సర్పంచ్ హైమావతి రాఘవులు పంపిణీ చేశారు. 30 మంది విద్యార్థినులకు సర్పంచ్ క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.రామారావు, పీఈటీ మొత్తం వెంకటేశ్వర్లు, విద్యాకమిటీ చైర్మన్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ఈపూరు ,డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఈపూరు హైస్కూల్లోని విద్యార్థులకు నూతన చట్టాలు వాటి అమలు గురించి ఎస్ఐ కె.వేణుగోపాల్ మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రిమినల్, సివిల్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కోరారు.

ఎమ్మెల్యే ఎదుట తెలుగు తమ్ముళ్ల వాగ్వివాదం

రొంపిచర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగులపాడులో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయి. గ్రామ పార్టీ అధ్యక్షుడి విషయంలో ఈ సంఘటన జరిగింది. గ్రామంలో ఎవరు పార్టీ అధ్యక్షుడు అనేది ఇంతవరకు తమకు తెలియదని ఒక వర్గం పేర్కొన్నారు. మరొక వర్గం పార్టీ అధ్యక్షుడి పేరును ప్రకటించామని పేర్కొన్నారు. పాత అధ్యక్షుడు, కొత్త అధ్యక్షుడు ఎవరు తమకు సమాచారం ఇవ్వలేదని పలువురు నాయకులు ఎమ్మెల్యే అరవిందబాబు ఎదుట ఘర్షణకు దిగారు. ఎమ్మెల్యే అందరూ కలసి పని చేయాలని సూచించటంతో వివాదం సద్దుమణిగింది.

ఆఖరి మజిలీకి అవస్థలు

● ఆక్రమణలో శ్మశాన వాటికలు ● పట్టించుకోని అధికారులు



జాగా లేక గేటు సమీపంలో పూడ్చివేత

వినుకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురై మృతులకు అంత్యక్రియలు నిర్వహించేందుకు వారి బంధువులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొన్ని శ్మశాన వాటికలలో వసతులు లేక అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల నీరు, నీడ వంటి మౌలిక వసతులు కూడా కరువయ్యాయి. టీడీపీ ప్రభుత్వం శ్మశాన వాటికలపై ప్రత్యేక దృష్టి సారించి స్థానికుల ప్రోత్సాహంతో అభివృద్ధి చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్వీర్యం చేసింది. పట్టణంలోని తిమ్మాయిపాలెం రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటిక మూడువంతుల పైగా ఆక్రమణలకు గురైంది. ఈ శ్మశాన వాటిక సుమారు ఐదు ఎకరాలు విస్తరణలో ఉండాల్సింది. ప్రస్తుతం రెండు ఎకరాలకే పరిమితమైంది. ఇందులో కొంత భాగం జంతు వధశాలకు కేటాయించగా మిగిలిన భాగంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. నీడ కోసం ఏర్పాటుచేసిన షెల్టర్ శిథిలావస్థకు చేరింది. నీటి వసతి కల్పించడంతో పాటు, భూమిని చదును చేసి ఆక్రమణకు గురైన భూములను శ్మశాన వాటికకు ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందనలేదని అక్కడ ప్రజలు ఆరోపిస్తున్నారు.



తిమ్మాయపాలెం రోడ్డులో ఆక్రమణకు గురైన హిందూశ్మశాన వాటిక

వెల్లటూరు రోడ్డులోని హిందూ శ్మశాన వాటికలో అరకొర వసతులే ఉన్నాయి. ఈ శ్మశాన వాటికలో గతంలో దాతల సాయంతో ఒక దహన వాటిక నిర్మించి వదిలేశారు. శ్మశానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా నివాస గృహాలు కావడంతో లోపలికి వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారింది. ఇదిలాఉండగా అంతిమ సంస్కారాలు పూర్తయ్యేవరకు వేచి ఉండేందుకు కనీసం నీడ సౌకర్యం కూడా లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువమంది వినియోగించే ఈ శ్మశాన వాటికలో మరో దహన వాటిక అవసరం ఉన్నప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు. అంత్యక్రియలు పూర్తిచేసిన వారు కాళ్లు చేతులు కడుక్కునేందుకు అవసరమైన నీటి కుళాయిలు ఏర్పాటు చేయాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉంది. ఖాళీ స్థలం ఉన్నప్పటికీ మొక్కలు పెంచే వసతి ఉన్నా పట్టించుకునే వారు లేరు దీనిపై సర్వహక్కులు ఉన్న ఆర్యవైశ్య సంఘం నూతన పాలకవర్గ వసతులు కల్పనకు కృషిచేయాలని కోరుకుంటున్నారు. నవాజ్‌కుంటలో సుమారు రెండు ఎకరాల విస్తరణంలోని శ్మశానంలో ఎటువంటి సౌకర్యాలు లేవు. తాగునీరు నీడకు షెడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అంబేద్కర్‌నగర్, ఇందిరానగర్ శ్మశాన వాటికల్లోనూ మౌలిక వసతులు లేవు. పట్టణ జనాభాకు అనుగుణంగా శ్మశానం లేకపోవడంతో కొందరు చెక్కవాగు సమీపంలోని 60అడుగుల రోడ్డు పక్కనే ఖననం చేస్తున్న పరిస్థితి. పాలకులు అధికారులు వినుకొండ పట్టణ జనాభాకు అనుగుణంగా శ్మశానాన్ని ఏర్పాటుచేసి కాల్చేందుకు, పూడ్చేందుకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌ను అడగగా శ్మశాన వాటికలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే అరవిందబాబు వినతి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం సీఎంవో కార్యాలయంలో ఎమ్మెల్యే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు వెంట నరసరావుపేట ఏరియా ఆసుపత్రి చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, అడ్వకేట్ చిన్నపరెడ్డి, తదితరులు ఉన్నారు.

నిధులు విడుదల చేయాలి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం పంచాయతీరాజ్ శాఖ నిధులు తక్షణమే విడుదల చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. మంగళవారం సచివాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కే.కృష్ణతేజని ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులు, గతంలో పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే క్లియర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. నిధులు సకాలంలో అందితే



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, తదితరులు

గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి ముఖ్యమైన పనులు వేగంగా పూర్తి అవుతాయన్నారు. కమిషనర్ కే.కృష్ణతేజ సానుకూలంగా స్పందించారు.

అన్ని అనుమతులతో కాసు సెంట్రల్ నిర్మాణం

గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ నుంచి ప్రభుత్వ జీవో ప్రకారం 3.5 ఎకరాలు తీసుకొని అన్ని అనుమతులతో కాసు సెంట్రల్ నిర్మించి ఆ అద్దెతో ఎడ్యుకేషన్‌కు వాడుకుంటున్నామని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం నరసరావుపేట క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ కాసు బ్రహ్మానందరెడ్డి నాగార్జున సాగర్, బుగ్గవాగు, పోచంపాడు వంటి బహుళార్థక ప్రాజెక్టులు కట్టి ఈ ప్రాంతాన్ని సస్యశామలం చేశారన్నారు. మాచర్ల గ్రామాన్ని కాసు బ్రహ్మానందరెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు దానిని పట్టణంగా అభివృద్ధి చేశాడన్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాచర్లలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ పెట్టారన్నారు. కాసు వెంకట కృష్ణారెడ్డి హయాంలో గురజాల రెవెన్యూ డివిజన్ అయిందన్నారు. బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. హత్య కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి సంబంధం లేదని, నిర్దోషిగా బయటకు వస్తాడని, అందుకనే సపోర్టుచేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేష్‌రెడ్డి మీద మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసీపీ కార్యకర్తలందరూ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి అండగా పోరాటం చేస్తామన్నారు. మాజీ మంత్రి విడదల రజనీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ విధంగా రెడ్ బుక్ రాజ్యాంగ అమలు చేస్తున్నారో అందరూ చూస్తున్నారన్నారు. రేపు వైసీపీ పాలన రాగానే కచ్చితంగా వేధిస్తున్న, నాయకులను, పోలీసులను వదలిపెట్టమని, రిటన్ గిఫ్ట్ ఇస్తామని హెచ్చరించారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందరి సంగతులు తేలుస్తామన్నారు.

ప్రజలను ఇబ్బంది పెడితే చట్టపరమైన చర్యలు

● హిజ్రాలకు రూరల్ సీఐ సుబ్బారావు హెచ్చరిక

నరసరావుపేట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రూరల్ పరిధిలో పెళ్లి వేడుక వేడుకల వద్ద, దుకాణాల వద్ద వ్యాపారులను ఇబ్బంది పెడితే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటానని సోమవారం సాయంత్రం నరసరావుపేట రూరల్ సీఐ ఏం సుబ్బారావు హిజ్రాలను హెచ్చరించారు. నరసరావుపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన హిజ్రాలకు సోమవారం సాయంత్రం నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ సుబ్బారావు మాట్లాడుతూ హిజ్రాలందరూ యాచక వృత్తి మానుకొని పని చేసుకుని జీవనం కొనసాగించాలని సూచించారు. నరసరావుపేట రూరల్ పరిధిలో పలు గ్రామాల వద్ద యాచక వృత్తిచేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈశ్వర్‌లో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు తెలిపారు. సివిల్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఐఐసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో ఈ సదస్సు జరిగింది. సూళ్ళూరిపేట యదుమాడి ఇంటిగ్రేటెడ్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ యంగ్ గార్డియన్ ఆఫ్ ఎర్త్ గీతిక వెంకటేషన్ ముఖ్యఅతిథిగా హాజరై పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ భాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హెచ్.గంగాధరరావు, షేక్ షరీఫ్, చైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఐఐసీ కన్వీనర్ డాక్టర్ షేక్ ముజీర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో...

నరసరావుపేట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డే కార్యక్రమం ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా.నాగోతు ప్రకాశ్ మాట్లాడుతూ చిన్న ప్రయత్నంతో పెద్ద మార్పులు సాధ్యమని, ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో బాధ్యతను పెంపొందించడమే మా లక్ష్యం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సబిత, ప్రిన్సిపాల్, రేఖ పులేకర్ పాల్గొన్నారు.

కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

● కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ

నరసరావుపేట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడం ప్రతి ఒక్కరూ బాధ్యత అని తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవ వేడుకలు ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం వల్ల కలిగే సమస్యలపై అవగాహన కల్పించేందుకే కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై విస్తృత ప్రచారం

శావల్యాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకొని నరసరావుపేటకు చెందిన త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని వయ్యకల్లు, గుంటుపాలెం, భాస్కర్‌నగర్, చిన్నకంచెర్ల, పిచికలపాలెం గ్రామాల్లో త్రైతసిద్ధాంత భగవద్గీతపై మంగళవారం విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు పెద్దారెడ్డి మాట్లాడుతూ భగవద్గీతలో శ్రీకృష్ణుడు బోధించిన అన్ని అంశాలను ప్రజలంతా చదివి జ్ఞానాన్ని పొందాలన్నారు. కమిటీ సభ్యులు ఎ.రమేష్, పి.రామయ్య, కె.వెంకటేశ్వర్లు, మస్తాన్, కె.చినవెంకయ్య, అమరలింగయ్య, నగేష్, సీతయ్య పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పుస్తకం ఆవిష్కరణ

రొంపిచర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలోని పీఎంశ్రీ ఏపీ మోడల్ పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించి పుస్తకాన్ని ప్రిన్సిపాల్ రవినాయక్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని రూపొందించిన విప్పర్ల ఎస్సీ కాలనీ ఉపాధ్యాయులు మల్లికార్జునరావును అభినందించారు. 90శాతం మార్కులు సాధించే విధంగా ఈ మెటీరియల్‌ను రూపొందించినట్లు ప్రిన్సిపాల్ రవినాయక్ తెలిపారు. విద్యార్థులు ఈ పుస్తకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

● అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం రెండో విడత ల్యాండ్ పోలింగ్‌పై జీవో విడుదల చేయటంపై రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అభివృద్ధి కమిటీ చైర్మన్ అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పట్టణాభివృద్ధి సంస్థ భూ సమీకరణకు జీవో ఇచ్చారన్నారు. అమరావతి పరిధిలో రెండో దశ భూసమీకరణకు ఏపీ కేబినెట్ నవంబరు 28న ఆమోదముద్ర వేసిందన్నారు. కొత్తగా ఏడు గ్రామాల పరిధిలో మరో 16,666.57 ఎకరాల భూసమీకరణకు సీఆర్డీఏకు అనుమతించే ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయటంపై హర్షం వ్యక్తం చేశారు.



పరి పొలాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

మోడల్ పాఠశాల విద్యార్థుల వ్యవసాయ క్షేత్ర సందర్శన

రొంపిచర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెం పీఎంశ్రీ ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు మంగళవారం వ్యవసాయ క్షేత్ర పర్యటనలో భాగంగా పొలాలను పరిశీలించారు. సాంఘికశాస్త్రంలోని వ్యవసాయం అనే పాఠ్యాంశాన్ని బోధించటంలో భాగంగా విద్యార్థులను వ్యవసాయ క్షేత్ర పర్యటనకు తీసుకువెళ్ళటం జరిగిందని ప్రిన్సిపాల్ రవినాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు విత్తే నాటి నుంచి కలుపు తీయటం, ఎరువులు, పురుగు మందులు వాడటం, వరి కోత వంటి అంశాలను వివరించారు. విద్యార్థులు తరగతి గదులకు పరిమితం కాకుండా బయట జరిగే అంశాలను కూడా తెలుసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభుదాసు, కరిముల్లా, అబీదున్నీసా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి: ఎంఈవో-2 లలితకుమారి

శావల్యాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ సర్వేని సిబ్బంది త్వరితగతిన పూర్తిచేయాలని ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి తెలిపారు. శావల్యాపురంలోని ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ సర్వేని ఆమె మంగళవారం పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 34 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు మొత్తం 999మంది విద్యార్థులుండగా వారిలో 27శాతం సర్వే పూర్తయిందని, మిగిలిన సర్వేకూడా త్వరగా పూర్తిచేయాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ సర్వేతో విద్యార్థులు ఏ సబ్జెక్టులో తక్కువ సామర్థ్యాలు కలిగి ఉన్నారో గుర్తించి వారికి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తారన్నారు. సీఆర్పీలు ఎ.శ్రీనివాసరావు, కొండలు, సిబ్బంది సౌమ్య, అంకిత, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

25మందికి తోపుడు బండ్ల పంపిణీ



తోపుడు బండ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన

చిలకలూరిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25మంది వీధి వ్యాపారులకు రూ.4 లక్షల విలువ చేసే తోపుడు బండ్లను జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పంపిణీ చేశారు. మంగళవారం జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా పీ-4 కార్యక్రమంలో భాగస్వామ్యులై నిరుపేదలకు అండగా నిలుస్తున్నందుకు రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట సేవలు అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్, దాతలు ముత్తినేని వెంకటేశ్వర్లు, తియ్యగూర యశ్వంత్‌రెడ్డి, మహమ్మద్ యూసఫ్ అలీ, ఉప్పుటూరి ప్రసాద్, బోడి రామ సుబ్బారావు, అడుసుమల్లి మోహన్, ఓబురి సాంబశివరావు, షేక్ మహమ్మద్ రఫీల సహకారంతో తోపుడు బండ్లను సేకరించారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు తేళ్ల సుబ్బారావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఉప్పుటూరి ప్రసాద్, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షుడు నార్నె జయలక్ష్మి పాల్గొన్నారు.



అనాథ పిల్లల కోసం సేకరించిన నిత్యావసరాలు

వికాస్ విద్యార్థుల దాతృత్వం

చిలకలూరిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెదనందిపాడు రోడ్డులో ఉన్న వికాస్ స్కూల్ విద్యార్థులు మంగళవారం మార్టూరులోని శారద విద్యానికేతన్ అనాథ ఆశ్రమాన్ని సందర్శించి ఆశ్రమ విద్యార్థులకు నిత్యావసరాలు, బుక్స్, ప్యాడ్స్, పెన్నులు తదితర వస్తువులను అందచేశారు. దాతృత్వం, మానవత్వం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించడం కోసం స్కూలు యాజమాన్యం వారు అనాథ విద్యార్థుల వద్దకు తీసుకెళ్లారు. స్కూలు డైరెక్టర్లు దండా పవన్ కుమార్, దండా రోజశ్రీల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలి: డీఈవో

నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 5లోపు మండల విద్యాశాఖ అధికారులకు అందజేయాలని డీఈవో ఎల్.చంద్రకళ మంగళవారం తెలిపారు. జిల్లాలో వివిధ ఉన్నత, ప్రైమరీ పాఠశాలలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు ఈ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పోస్టుల వివరాల కోసం సంబంధిత మండల విద్యాశాఖాధికారులను సంప్రదించాలన్నారు.

శావల్యాపురంలో రైల్వే సమస్యలను పరిష్కరిస్తాం

● దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ రాధ



బోర్డుమెంబర్ రాధకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కూటమి నాయకులు

శావల్యాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం రైల్వే జంక్షన్‌లో నెలకొని ఉన్న సమస్యలను రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని దక్షిణమధ్య రైల్వే బోర్డు మెంబర్ కొంకేరు రాధ తెలిపారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదేశాల మేరకు శావల్యాపురం రైల్వేజంక్షన్‌ను ఆమె మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన రెండో ప్లాట్‌ఫారంపై తాగునీటి కొళాయిలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని, స్టేషన్ ఆవరణలో పిచ్చిమొక్కలను వెంటనే తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని స్టేషన్ మాస్టర్ మధుకి సూచించారు. కరోనా సమయం నుంచి స్టాప్‌లను తొలగించిన అన్ని రైళ్ళను తిరిగి నిలుపుదల చేసేలా చూడాలని కూటమి నేతలు బోర్డు మెంబర్ రాధకు వినతిపత్రాన్ని సమర్పించారు. తిరుపతి-బెంగుళూరు రైలును స్టేషన్‌లో నిలుపుదల చేయాలని, కొత్తగా ఏర్పాటు చేసిన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేమార్గంలో గూడ్సులతోపాటు మామూలు రైళ్లను రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సీనియర్ నేత బొల్లా పేరయ్య కోరారు. టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒత్తుల వెంకటేశ్వర్లు, గ్రామపార్టీ అధ్యక్షుడు నలమాటి వెంకటేష్, సాగునీటి సంఘం అధ్యక్షుడు చెరుకూరి రామాంజనేయులు, గ్రామ నాయకులు చెరుకూరి చౌదరి, కేవీఆర్ మోహన్‌చంద్, బాలకృష్ణ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, సర్పంచి, గ్రామ పెద్దలు

బాలోత్సవంలో బొగ్గరం విద్యార్థుల ప్రతిభ

ఈపూరు డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా బాలోత్సవం కార్యక్రమంలో ఈపూరు మండలం బొగ్గరం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరచి బహుమతులు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం ఎం.రామారావు తెలిపారు. పాఠశాల నుంచి 60మంది విద్యార్థులు పాల్గొని అన్ని రంగాల్లో ప్రదర్శనలు ఇచ్చి విజేతలుగా నిలిచారన్నారు. అంతర్జాల అన్వేషణలో సీనియర్ విభాగంలో నరసింహ భార్గవ్ ప్రథమ బహుమతి, మెమొరీ టెస్ట్‌లో కొదమగుండ్ల శివ ఆర్యన్ ద్వితీయ బహుమతి, పసుపులేటి అఖిలేష్ తృతీయ బహుమతి సాధించాడు. సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో కోలాటం, లఘునాటికలు, ఫోక్ డాన్సులు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హైమావతి రాఘవులు విద్యా కమిటీ చైర్మన్ మేకల వెంకట్రావు, గ్రామ పెద్దలు విద్యార్థులను అభినందించారు.